

# తులసి బాలకృష్ణ • వెలుగు చూడని న్యాయం

ముసలి వయసు సణుగుడు లాగ ఆగకుండా సన్నగా కురుస్తోంది వాన. వానకడిగిన రోడ్లమీద వాహనాలు హంసల్లా జారుతున్నాయి.

డ్రైవింగు సీట్లో కూర్చుని, డోర్ కసిగా మూసి, కోపంగా స్టార్ట్ చేసి, "థూ నీయమ్మ-పగల్లేదు, రేత్రి ల్లేదు-దీన్నిగ్గోసిర్దూటీ" అన్నాడు రెడ్డి, స్వగతంగా అంటున్నంత నెమ్మదిగా, ప్రక్కనున్న జపాన్‌కి వినిపించాలన్న వుద్దేశ్యంతో.

జపాన్ ఏంవీ మాట్లాడలేదు. సీట్లో సర్దుకూర్చుని, బీడీ వెలిగించి, దానికి యింకోటి ముట్టించి, రెడ్డి నోటికి అందించాడు.

ప్రవాహం వున్న వైపుకు చులాగ్గా పాకుతూన్న పడవలాగ జారుతోంది లారీ తారు రోడ్డు మీద.

"ఈ ఓనోటీ....దీనమ్మ........" అంటూ అన్నిట్లోకి పెద్ద బూతు తిట్టేసాడు రెడ్డి.

బెంగ పెట్టుకున్న వాడిలాగ బీడీ

కాల్పనికంలో నిమగ్నుడై, పొగలోంచి బయటకు చూస్తున్నాడు జపాన్.

లారీ లైట్ల వెలుతుర్లో నిటారుగా కురుస్తూన్న వాన—వెండితెర మీద డొక్కు సినిమా పాత ప్రింటు బొమ్మలావుంది.

"ఇందాక గొంతు తడుపుకోమంటే వద్దన్నావేటి" అన్నాడు రెడ్డి స్టీరింగుని విష్ణుచక్రంలా తిప్పుతూ.

"ఊరికే. మనసు బావోలేదు" అన్నాడు జపాన్ ముక్తసరిగా.

చటుక్కున కనుబొమలు విరిచి, "ఏం?" అన్నాడు రెడ్డి.

"............" కళ్లు మూసుకొని, ముఖం పైకెత్తి, నోట్లో పొగని రివ్వున వదిలాడు. ఆ తర్వాత మరో రెండు సార్లు అలా చేసాడు జపాన్.

"ఏటా సవిలెన్నేటీ గోరంగా? .... అసలు కారణం ఏవిటో సెప్పకూడదూ?"

".....ఏబ్లేదూ – సూరబ్బాయిగోడు విన్న తాగేసి లారీ నడిపి బజార్లో కుష్టురోగపాడి మీదకెక్కించేసాడు. అది గుర్తొచ్చి బాధగా వుంది."

ఆశ్చర్యాన్ని, వెటకారాన్ని కలబోసి లారీ స్టార్టు అయినట్లు ఒళ్లుకుదుపుతూ నవ్వేడు రెడ్డి. ఆ తర్వాత నవ్వు అపుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు, "ఓస్ అదా! ........ ఆమాత్రానికే? అందుకనా మనసు బావోలేకపోవడం – సేబాసు. ఊ....అందుకనే మనసు బావో లేనప్పుడే మరి ఓ సుక్క....." అంటూ ఏదో అనబోయిన రెడ్డి గబుక్కున రెండో చెయ్యి కూడ స్టీరింగుమీద వేసి, బలంగా ఎడమవైపుకి తిప్పి, రోడ్డు దిగిపోయి, కంగారుగా కుడివైపుకి తిప్పి, ముందుకు సాగబోయి,....గోలగా అరుస్తూ అడ్డొచ్చిన జనాన్ని చూసి, గాభరాపడుతూనే ఆపుచేసాడు లారీ.

ఒక్క పెద్దకుదుపుతో ఆగింది బండి.

"అఁ....అఁ....పిల్ల....పిల్ల ...." అని జపాన్ అరిచిన అరుపు అప్పటికే లారీ చప్పుడులో కలిసిపోయింది.

గబుక్కున తలుపు తీసుకొని దూకి, వెనక్కి పరుగెత్తాడు జపాన్.

ఏం జరిగిందో, ఏం చెయ్యాలో తెల్సుకోలేక సీటుకే అంటుకుపోయాడు రెడ్డి. లారీని అడ్డిన జనంలో కొందరు లారీ వెనక్కి పరిగెత్తారు. మరికొందరు రెడ్డి దగ్గర కొచ్చి, లారీ దిగమని గద్దించారు.

పూర్తిగా మైకం దిగని రెడ్డి,.... "దీనమ్మ....గొడవ...." అంటూ లారీ దిగాడు.

అంతా గోల.

అరుపులు.

ఇటూ అటూ పరుగులు.

"అయ్యో.......అయ్యో.........సిన్న పిల్లయ్యా పాపం! చ్చ్చచ్చ్....ఒతే మంగా– ఆ ఒటేల్ కాడ్నుంచా లాంతరిలా అట్టూరా" అన్నాడొక తాత.

"ఎవరి పిల్లోగాని, సిన్న వయసులోనే నూరేల్లూ నిండిపోయేయమ్మా పాపం" —చీకట్లో కళ్లు పొడుచుకు చూస్తున్నారు అందరూ పిల్లను గుర్తుపట్టడానికి.

"మా పవిపిల్ల—సీత" అంది ఒక ఆడగొంతు—నూతిలోంచి వస్తూన్న ధ్వనితో.

తలలన్నీ అటు తిరిగాయి.

"ఎవలాలు?" అన్నాడు తాత-కళ్లు చిట్లించి చూస్తూ.

అతను చూసిన దిక్కున తలమీదుగా కొంగు కప్పుకుని, భయంతో బిగుసుకు పోయిన పిల్ల నిల్చుని వుంది.

"ఎవలంటే....?" అన్నాడు తాత హెచ్చుస్వరంతో.

"నేను......లక్ష్మిని....మునసబుగారి అమ్మాయిని"

"మీ రాండమ్మాయిగోరూ!......ఏటీ ఈ పిల్ల సీతంటే....రావయ్యకూతురే?" భయాన్ని మింగడానికి ప్రయత్నిస్తూ, వొణుకుతున్న గొంతుతో అన్నాడు తాత.

లక్ష్మి తలూపిందిగానీ, చీకట్లో తాతకి కనిపించలేదు.

లాంతరొచ్చింది. వాన పడి ఆరిపో కుండా పై గుడ్డ అడ్డేసి పట్టుకున్నాడు లాంతరు తెచ్చిన మనిషి. లాంతరు వెల్తుర్లో శవాన్ని చూసిన జనంగుండెలు ఓ క్షణం మౌనం పాటించి మళ్లీ కొట్టు కున్నాయి వేగంగా.

పరికిణీ, జాకెట్టు తొడుక్కున్న పదేళ్లపిల్ల. మొహం చాలా ప్రశాంతం గానూ, అమాయకంగానూ, నిద్రపోతు న్నట్లు వుంది. లారీ చక్రం గుండెల మీద నుంచి వెళ్లిన గుర్తు స్పష్టంగా తెలుస్తోంది.

"అదుగో-రావయ్య కూతురే. ఆడికి ఈ ముసలి వొయసులో ఏం కట్టం తెచ్చి పెట్టావురా బగమంతుడా" అన్నాడు తాత చేతులు జోడించి.

"మొదటి ఆట సినిమా చూసి, ఇప్పుడే అటువైపున బస్సుదిగాం. రోడ్డు దాటు తూంటే...." భయంతో వొణికిన గొంతు యిక పెగల్లేదు. తలొంచుకుని నిల్చుంది లక్ష్మి.

అందరిచూపులూ శవంమీదే. అందరి కళ్లల్లోనూ చెమ్మ, అందరి మనస్సుల్లోనూ 'నిజంగా చచ్చి పోయిందా-మన కళ్లెదురుగా తిరిగినపిల్ల' అనే అనుమానం, 'మళ్లీ బ్రతికితేనో...' అనే కోరిక.

మైలురాయి వారగా తలపట్టుకుని కూలబడ్డాడు జపాన్.

రెడ్డికి కూడా ఆ పిల్ల శవాన్ని చూస్తూంటే చాలా బాధగా వుంది. అంతకు మించి జరగబోయే గొడవ నుంచి ఎలా తప్పించుకోవడమా అనే ఆలోచన, తనకు వున్న కొండంత అండని తలుచుకుంటే ధైర్యం కలుగు తున్నాయి. వానకి తడిసిన జుట్టులోంచి

నుదుటిమీదకు కారుతూన్న నీటిధారల్ని యధాలాపంగా బొటనవేలుతో తుడుచుకున్నాడు.

రోడ్డుమీద శవంనుంచి రక్తం సరిసమానంగా అటూ యిటూ ప్రవహించి, వాననీటిలో పల్చబడిపోతోంది.

క్షణాలు, నిమిషాలు గడుస్తున్నాయి.

రాళ్ల మధ్య తాటాకు గొడుగుని నిలబెట్టి, దాని క్రింద లాంతరుపెట్టి, వస్తూన్న వాహనాల్ని ప్రక్కగా మళ్లిస్తున్నారు జనం. ఒకరిద్దరుగా అక్కడకు చేరుతూండగా గుమిగూడిన గుంపులో గుసగుసలు, నిట్టూర్పులు అంతకంతకు ఎక్కువ అవసాగాయి.

అట్నుంచి వచ్చి ఆగిన లారీ డ్రైవరుకి ఏదో చెప్పాడు రెడ్డి.

"ఈ లారీ డ్రైవరుగాడు పారిపోకుండా చూసుకోవాలి." అని గొణిగాడు ఒక యువకుడు తాత చెవిలో.

తాత తల వూపి, పిల్లవైపే చూస్తూ కళ్లు మూసుకున్నాడు.

"ఇదిగో డ్రైవరూ-ఇలగ పక్కగా ఒచేలు కాడ కూకో. ఇప్పుడెంత తతంగం వుందనీ....సచ్చిన పిల్లెలాగూ సచ్చిపోయింది. మిగిల్నాళ్లకి సచ్చినంత పనిప్పుడు" అన్నాడొక ఆసామి, తన మీద ఎక్కువ బాధ్యత పడ్డట్లు ఫీలయిపోతూ.

తడక ప్రక్కగా వున్న బల్లమీద తలొంచుకొని కూర్చున్నాడు రెడ్డి.

బీడీ కాల్చుకుందామనుకున్నాడు. గానీ బాగుండదని వూరుకున్నాడు. టీ అర్డరిద్దామని నోటిదాకా వచ్చిన పలుకు గొంతులోకే జారిపోయింది.

మునసబుగారి అమ్మాయికి తోడిచ్చి యింటికి పంపించేసారు.

మునసబుగారు వూళ్లో లేడు. కరణానికి కబురుపంపారు.

ఆగి, హెచ్చి కొడ్తోంది వాన. గాలి తెరలుతెరలుగా వచ్చి చెవుల్ని కోస్తోంది. చెట్లన్నీ భయంకరంగా రోదిస్తున్నాయి.

"అమ్మా -నా తల్లీ -నా బంగారం - నా సీతమ్మా....."

— దూరంనుంచీ వినిపిస్తూన్న ఆ ఆర్తనాదాలు క్రమేపీ దగ్గరవుతూండగా అందరూ కళ్లు తుడుచుకున్నారు. కొద్ది క్షణాల్లో ఆ ప్రదేశానికి చేరబోయే సీత తండ్రి రామయ్యని ఎలా ఊరడించాలా అనే ఆలోచన్లో పడ్డారు.

"నా చిట్టితల్లీ నిజమేనా యీ మాట? ....నువ్వు ఈ ముసలి వయస్సులో నన్ను ఒంటరివాణ్ని చేసి వెళ్లిపోయేవా? ....అబద్ధంకదూ...."

—బాగా దగ్గరగా వినిపించాయి మాటలు.

"సోవయ్యా తాతా! ఆ ముసిలాడొచ్చేత్తన్నాడు. నువ్వే ఎలాగోలా ఓదార్చాలి. అందులో మళ్లీ తాగేసినట్లున్నాడు కరణంగోరొత్తే అరే సూసుకుంటారు," అన్నాడొక యువకుడు.

"పాపం! ఆ ముసిలోడికి యేం కట్ట వొ(చ్చింది! .... అసలే ఆ యెదవ తాగుడికి డబ్బంతా తగలేసి, యింట్లో అందర్నీ సంపుకుని, మిగిలిన ఈ ఒక్క పిల్లనీ మునసబుగోరింట్లో పనికి పెట్టి, ఆరిచ్చిన డబ్బుల్తో కొంత తిని, కొంత తాగి, ఏదో బతుకుతున్నాడు. ఇప్పుడే పిల్ల కూడా తన దారి తను సూసుకుని, ఆ ముసిలోడ్ని ఒంటరోడ్నిసేసేసింది" అన్నాడు సోమయ్యతాత, కళ్లు తుడుచుకుంటూ.

ఇద్దరు మనుషుల ఆసరామీద రోడ్డు మీదకొచ్చి, లైటువెలుతుర్లో వలయంగా నిల్చున్న జన్నాన్ని, మధ్యలో భవబంధ విముక్తురాలై, చిరునవ్వుతో పడివున్న కన్నకూతురు సీతనీ, ఆమె ప్రక్కన మడుగులు కట్టిన రక్తాన్నీ చూసిన రామయ్య కొయ్యబారిపోయేడు. కళ్ల రెప్పలు వాల్చకుండా, అదురుతూన్న పెదవులతో ఎఱ్ఱబారిన ముఖంతో, ముఖాన ఉబ్బిన నరాలు కణతల్ని చింపుకుని బయటకు వచ్చే ముందే-నేలమీద నిలవలేక నిలువునా కూలిపోయేడు. గుండెలు పగిలేలాగ ఏడుస్తూ, పాకుతూ శవాన్ని చేరి, పిల్లని పేరెట్టి పిలుస్తూ, ముఖమంతా పదేపదే ముద్దు లెట్టుకున్నాడు.

అతన్ని ఓదార్చే శక్తి ఎవ్వరికీ లేక పోయింది.

అప్పుడే అక్కడకు చేరిన నల్ల గొడుగుకి తాటాకు గొడుగులూ, తువ్వాళ్ళూ దారిచ్చాయి వినయంగా.

"ఊరుకో రామయ్యా—ఊరుకో. రుణం తీరిపోయింది. అంతే. అసలింతకీ ఈ లారీ డ్రైవరు గాడిదకొడుకుల్ని నరికెయ్యాలి. ఏడీ వాడు? – ఏడయ్యా ఆ లారీ డ్రైవరేడీ?" అని కోపంగా అరిచాడు కరణం చుట్టూ చూస్తూ.

"అవును బాబూ ఆ లారీ డ్రైవరు గాడ్ని నరికెయ్యాలి. నా చిట్టితల్లిని నానుంచి దూరంచేసిన ఆ వెధవని చిత్రవధ చెయ్యాలి. ఉరిశిక్ష వెయ్యాలి..." ఆవేశంగా అరిచాడు రామయ్య. ఆపైన రెండు చేతుల్లో ముఖం దాచుకుని భోరున ఏడ్చాడు.

"అలాగే తప్పకుండా ఆ డ్రైవర్ని శిక్షిద్దాం. వదిలిపెట్టొద్దు. నేను చూస్తాగా ఆ విషయం" అని రామయ్యకు ధైర్యం చెప్పుతూ ఓదార్చి, జనంవైపు తిరిగి "ఏడయ్యా ఆ డ్రైవరూ?" అన్నాడు కరణం.

హోటల్ తడక ప్రక్కనున్న రెడ్డిని చూపించారు జనం కరణానికి.

"వాడెక్కడికీ పారిపోకుండా చూడండి. ఈలోగా ఇట్నుంచి వచ్చే ఏ కారువాడికో చెప్పండి, పట్నం నుంచి పోలీసుల్ని పంపమని" అని ఆజ్ఞాపించాడు కరణం.

"ఇందాకట్నుంచీ ప్రయత్నిస్తున్నావండి. అందరం ఆ ఎదర్నుంచి యిటేపు ఎళ్లే

వాళ్లవేఁ అంటారు గానీ – ఒక్కడూ ఆ పోలీస్టేసెనేప ఎల్లవంటున్నారండి" కరణంగారితో మాట్లాడానికి ఛాన్సు దొరికిందే తడవుగా తకీమని చెప్పాడు ఓ కాకీ నిక్కరు అబ్బాయి.

"అంతేలే. పోలీసుస్టేషన్కి వెళ్లే ముందు వాళ్ళని పట్టుకుంటారని వాళ్ళ భయం. కేడీ గాడిద కొడుకులు. అయినా చెప్తేమాత్రం ఈ రాత్రివేళ వానలో పోలీసువాళ్ళు వస్తారా? నెమ్మదిగా తెల్లారేక, టిఫిన్ అయ్యాక తాపీగా వస్తారు. అందాకా ఈ శవ జాగరణ మనకి తప్పదు" అని విసుక్కుని, తల పంకించి ఆలోచించి, "పోలీసులూ లేదు, ఏం లేదూ — పోయిన పిల్ల ఎలాగూ తిరిగిరాదు – ముందా డ్రయివరుగాడికి చెయ్యో కాలో తీసేస్తే సరి – యిలా తీసుకురండి వాడ్ని" అన్నాడు కరణం చిరచిర లాడుతూ.

జనం రెడ్డిని తీసుకొచ్చి, కరణం ముందు విలబెట్టారు.

"ఏఁవయ్యో – కళ్ళు కనిపించవా, ఒళ్ళు మదవెక్కిందా – లారీని...." అంటూ ఆయన ఏదో అనబోతుండగానే–

"నేను జగ్గయ్యగారి కంపినీలో డయివోర్నండి...." అన్నాడు రెడ్డి నిర్లక్ష్యంగా.

కరణం నోరు తక్కున మూతపడి, ఓ నిమిషానికి తెరుచుకుని –

"నువ్వు.... జగ్గయ్యగారి కంపెనీలో...."

"అవునండీ–అతను మా మడిసే...."

—అప్పుడే కారు దిగి, కంగారుగా వస్తున్న జగ్గయ్య చిరునవ్వుతో అన్నాడు.


వంగి చేతులు జోడించాడు కరణం.

జగ్గయ్య చిరునవ్వు బాణం విసిరాడు. ఆ బాణం తగిలి, ఆనందం పట్టలేక, ఉక్కిరి బిక్కిరై మెలికలు తిరిగాడు కరణం. ఆ పైన కరణాన్ని ఓ ప్రక్కగా తీసుకుపోయి, చెవి కొరికేశాడు జగ్గయ్య. తన భుజంమీదున్న జగ్గయ్య చేతిని చూస్తూంటే తనని దేవేంద్ర సింహాసనంమీద కూర్చోబెట్టినట్లుంది కరణానికి.

"పాపం – ఒకప్పుడు బాగా బతికిన వాడేనండీ. వెధవ తాగుడికి బానిసై పోయి, సర్వం నాశనం చేసేసుకున్నాడు ఇదుగో ఇప్పుడీ పిల్లకూడా పోవడంతో మరీ అనాధప్రాణి అయిపోయాడు ముసలాడు..." —రామయ్యమీద తన కున్న జాలిని నెమ్మదిగా జగ్గయ్యతో విన్నవించుకున్నాడు కరణం.

"అందుకనే మరీ— తాగుబోతయితే నే సెప్పిన్దానికి మరోమాట లేకుండా ఒప్పుకు తీరుతాడు. అందులో యిప్పుడు కూడా కొంత మైకంలోనే వున్నాడంట న్నారుగా" అన్నాడు జగ్గయ్య కరణం భుజం తట్టి, తొందరపెడ్తూ.

'ప్రయత్నిస్తాను' అన్నట్లుగా తల



వూపి, రామయ్య దగ్గరకొచ్చి, అతని భుజంమీద చెయ్యేసి తట్టాడు కరణం.

—ఏడ్చి, ఏడ్చి శోషకొట్టినట్లు పడి వున్న రామయ్య నెమ్మదిగా తలెత్తి, పిచ్చిగా చూసాడు.

కరణం సంజ్ఞని గ్రహించి, ఇద్దరు మనుషులు ముందుకొచ్చి, రామయ్యను లేపి, నిలబెట్టారు. తనతో రమ్మని సంజ్ఞచేసి, పాక హోటల్లోకి దారితీసాడు కరణం. తూలుతూ, కరణాన్ని అనుసరించాడు రామయ్య –

నీరసం, పూర్తిగా దిగని మైకం, గుండెలు పగిలే బాధ,.... రామయ్య సరిగా నడవలేకపోతున్నాడు.

"నా సీతమ్మ తల్లిని పొట్టన పెట్టుకున్న ఆ లారీడ్రైవర్ని...." ఇంకా ఏదో అనబోతుండగానే రామయ్యని వారించాడు కరణం.

"ఆగు. ఆవేశపడకు. నీ బాధ – మా అందరి బాధను. జరగకూడనిదే జరిగిపోయింది. కాని ఏం చేస్తాం చెప్పు? వాడ్ని ఏం చేసినా నీ కూతురు బతికొస్తుందా చెప్పు? పోలీసువాళ్ళకి వాడ్ని పట్టించి, జైల్లో పెట్టిస్తే మాత్రం ప్రాణంలేని ఆ కట్టెకి ప్రాణం వస్తుందా?.... అయినా బతికుండి మాత్రం ఏం సుఖపడిపోయింది చెప్పది?"

సూటిగా ప్రశ్నించాడు కరణం.

కుప్పలా కూలిపోయి, చేతుల్లో ముఖం దాచుకుని రోదించాడు రామయ్య.

"పాపిష్టి వెధవని. ఈ తాగుడువల్ల మొత్తం కుటుంబాన్ని నాశనం చేసుకున్నాను. మునసబుగారి పంచన గుంటదన్నా సుఖపడుతోందని తృప్తిగా వుండేది. ఇప్పుడు.... దానికీ నూరేళ్ళు నిండిపోయాయి, నా బ్రతుకూ ముష్టి బతుకయి పోయింది."

"చూడు రామయ్యా! నీ గురించి పూర్తిగా చెప్పాను ఆ లారీ యజమానికి. ఆయన మనస్సు కరిగిపోయింది. పోలీసుల చేతుల్లో వాళ్ళ డ్రయివరు చిక్కకోకుండా ఆయన అతి సులభంగా తప్పించగలడు. కానీ—నీ గురించి ఆయన ఆలోచించాడు. అర్థమవుతోందా? మరోమాట లేకుండా నేను చెప్పినట్లు చెయ్యి. ఊఁ. వెళ్ళి నీ పిల్లను తీసుకో. విషయం మన వూరు దాటకుండా నేను కట్టుదాటు చేస్తాను. తెల్లారేలోగా ఆ శవానికి అన్నీ అయిపోతాయి. ఇక నీకు ఆయన చేసే సహాయం - ఓ రెండు వేలు ముట్టచెప్పమన్నాను. హాయిగా కొట్టో ఏదో పెట్టుకుని, జాగర్తగా గడుపుకుంటూ సుఖపడవచ్చు నువ్వు".

— రామయ్య మతిపోయినవాడిలా చూస్తూండిపోయాడు కరణాన్ని - రెండు నిమిషాలు పోయేక బలవంతంగా గొంతువిప్పి మాట్లాడాడు-

"బాబూ.... డబ్బుకోసం.... ఆ రాక్షసుణ్ణి.... నా సీతమ్మతల్లి పాలిటి యమధర్మరాజుని...." ఆవేశం, దుఃఖం ఒక్కుమ్మడిగా వురికిరావడంతో గొంతు మూగబోయింది రామయ్యకి. కళ్ళమ్మట రక్తధారాలే కారాయి.

"పిచ్చివాడా! ఇంకెక్కడి సీతమ్మోయ్ ?!? ప్రాణంలేని ఆ కట్టెని ఏంచేసుకుంటావు ?"

"అదికాదు బాబూ....డబ్బుకోసం.... వాడ్ని వదలిపెట్టడమా ?.... ఆ శవం మీది కూడు తినమంటారా ?"

"నీ మొహంలా వుంది. అయినా నీ కుటుంబంలో మిగిలింది ఈ ఒక్కతేగా! మిగిలినవాళ్ళంతా యెలా చచ్చిపోయారోయ్ ?"

"బాబూ— ఆ విషయం గుర్తు చెయ్యొద్దు బాబూ! పిచ్చెక్కిపోతోంది."

"అందరూ యిలాగే పోయారంటావా? ఎంత వున్నతకుటుంబంలో పుట్టి, ఎంత గొప్పగా బతికినవాడివి ఎలా అయిపోయావు! అప్పుడెవర్ని శిక్షించావు ?"

"బాబూ— దానికంతటికీ నా తాగుడే కారణం - మీ కాళ్ళు పట్టుకుంటాను. ఆ ఘోరాన్ని గుర్తు చెయ్యొద్దు."

"గుర్తు చెయ్యడానికి యిన్నాళ్ళూ ఎలా మర్చిపోయావోయ్ ?"

"తాగాను బాబూ.."

"ఇది మరిచిపోవాలన్నా అలాగే తాగు"

"....తాగుతాను బాబూ"

"తాగుతావా!.... మరి - దబ్బేది?"

"అవును....డబ్బు....డబ్బు కావాలి బాబూ....తాగాలి....తాగుతూ కష్టాలన్నీ మరచిపోవాలి.... పెళ్ళాం, బిడ్డలూ,.. పోనియ్ ... తాగాలి.... తాగించండి...."

"అద్గదీ....వెళ్ళి పిల్లను తీసుకో...." ఆజ్ఞాపించి, జగ్గయ్యవైపు నడిచాడు కరణం విజయ గర్వంగా.

"మంచిపని పేసారండీ కరణం గోరూ - డబ్బు గురించి కాదుగానీ - పోలీస్టేసనంటేనే మాపెద్ద సిరాకు నాకు. అందులో ఈ డయివరున్నాడే - మాగొప్ప పనోడు. కోపగించుకున్నాడంటే నా బిజినెస్సే పడిపోద్ది. అందుకనే ఎక్కడ పమయం అక్కడే ఎలాగోలా పైసలా జేసేత్తూంటా" అన్నాడు జగ్గయ్య జేబులోంచి డబ్బు తీస్తూ.

- శవంవైపు గబగబా పరిగెత్తినట్లు నడిచాడు రామయ్య.

రోడ్డుమీద నిర్జీవంగా పడివున్న సీత సారానిండుగా వున్న రబ్బరు ట్యూబులా కనిపించింది రామయ్య సారా కళ్ళకి. ఆశగా చూస్తూ వంగాడు శవంమీదకి. శవాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని పైకి లేపబోయేడు -

కాని.... చేతులకి....శవం శవం లాగే తగిలింది.

రక్త స్పర్శ గుండెల్ని పిండింది.

నరనరాలూ బాధతో ఘూర్జిల్లాయి.

కూతురు శవాన్ని గుండెలకు హత్తుకుని అలాగే పడిపోయేడు రామయ్య.

జగ్గయ్యనుంచి రెండువేలూ అందుకున్నాడు కరణం.

వడి వడిగా నడిచివచ్చి, "రామయ్యా త్వరగా తీసుకుపద" అన్నాడు కరణం.

"లేదు బాబూ.... వీల్లేదు... నా చిట్టితల్లి శవాన్ని డబ్బుకి అమ్మను. నేను తర్వాత అడుక్కుతిన్నా పరవాలేదు. నన్ను బలవంత పెట్టకండి." అంటూ మరోసారి గుండెలవిసేలా రోదించాడు రామయ్య - కూతురి శవాన్ని మరింత గట్టిగా పొదివి పట్టుకుని.

"ఓర్నీ దుంపతెగ! మళ్ళీ మొదటికొచ్చావే.... ఇదుకో, ఈ డబ్బు చూడు...."

"వద్దు బాబూ.... ఒద్దు. ఆ పాపిష్టి డబ్బుని నాకు చూపించొద్దు. నా కూతురు అనాధ కాదు. నేనున్నాను. దాన్ని పొట్టన పెట్టుకున్న ఆ డ్రయివరుగాడ్ని పోలీసులకు పట్టించిగాని వూరుకోను. వాడికి శిక్షపడితేనే గాని నా సీతమ్మ ఆత్మ శాంతించదు...."

—ఎంత ప్రయత్నించినా రామయ్యని ఒప్పించలేకపోయాడు కరణం.

విసుగ్గా పచార్లు చేస్తున్నాడు జగ్గయ్య.

చిరాగ్గానూ, కోపంగానూ చూసాడు రెడ్డి, రామయ్యని.

ముగ్గురూ ఒకచోట చేరి ఏదో నిర్ణయించుకున్నారు. గబగబా నడచి వచ్చి, రామయ్యను బలవంతంగా పైకి లేపబోయేరు -

ఇంతలో—

"ఆగండి. ఆ శవాన్ని కదపొద్దు" అన్న అరుపుకి అందరూ చేష్టలుడిగి చూశారు అటు.

జీపులోంచి బిలబిల మంటూ దిగారు పోలీసులు.

వారి వెనకనే జపాన్.

"బాబూ - నాకు న్యాయం జరిపించండి" అని మొరపెట్టుకున్నాడు రామయ్య పోలీసులతో.

తమ కార్యక్రమం యథావిధిగా సాగించారు పోలీసులు.

జరుగుతూన్నది చూడలేక కళ్ళు మరింత గట్టిగా మూసుకుంది రాత్రి.

అప్పటికి భయంతో నోరు మూసుకుని, తెల్లారేక భోరున ఏడ్చింది ఆకాశం.

ఆ తర్వాత —

"పిచ్చాడు - రెండు వేలూ వదులుకుని, అడుక్కు-తింటున్నాడు - దేవికయినా అదృష్టం వుండాలి" అనుకున్నాడు కరణం.

ఈ దేశంలో జరిగే న్యాయాన్ని పొరబాటుగా అర్థం చేసుకున్నందుకు విపరీతంగా నొచ్చుకున్నాడు - లైసెన్సు లేకుండా లారీ నడిపాడన్న నేరం (నెపం) మీద కటకటాల వెనక కాలం గడుపుతూన్న జపాన్.

లారీ డ్రైవరు రెడ్డి మనశ్శాంతి గాలి పీల్చుకోవడానికి జగ్గయ్యగారి ప్రోద్బలం మీద కాశ్మీరు వెళ్ళాడు.

"వెధవడబ్బు పోతే పోయింది - నా కన్నతల్లిని పొట్టన పెట్టుకున్న వాణ్ని పోలీసులకు పట్టించాను. నా సీతమ్మతల్లి ఆత్మ శాంతించింది" అంటూంటాడు భిక్షమెత్తుకు జీవిస్తూన్న రామయ్య.

అన్నట్టు —

రాజ్యాలు పోయినా, ప్రభుత్వాలు మారినా ఈ దేశంలో పేదవాడికి జరిగే న్యాయంల్లో మాత్రం తేడాలేదు — పేదవాడు 'న్యాయం జరిగింది' అని సంబరపడటం - స్వయంగా చక్కి-లిగింతలు పెట్టుకొని నవ్వుకోవడంతో సమానం అని తెలియనివారిలో రామయ్యా ఒకడు.

